దప్పిక తీరే దారేది?


ఎంఈఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్

- ప్రభుత్వ కార్యాలయాల్లో మంచినీటి కొరత
- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అధికారులు చొరవ చూపాలని కోరుతున్న అర్జీదారులు

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వివిధ పనుల కోసం వచ్చే ప్రజలు అక్కడ తాగేందుకు గుక్కెడు నీరు లేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోని పలు కార్యాలయాల్లో వివిధ పనులపై ప్రతి రోజూ పెద్ద ఎత్తున ప్రజలు, అర్జీదారులు వస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయా శాఖల అధికారులు ప్రజల నీటి సమస్యను పట్టించుకోక పోవడంతో బాహాటంగానే అధికారుల తీరును విమర్శిస్తున్నారు. సర్టిఫికెట్ల కోసం, ఉపాధి పనుల కోసం, పలు రకాల వ్యాధులతో బాధపడేవారు.. ఇలా ఎన్నో సమస్యలతో మండుటెండల్లో కార్యాలయాలకు వచ్చే ప్రతి ఒక్కరూ తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల ప్రజలు తమ అవసరాల కోసం పలు ప్రభుత్వ కార్యాలయాలు, వైద్యశాలలకు వెళ్తుంటారు. కార్యాలయాలకు వెళ్లిన వారి పనులు ఒక్కోసారి తొందరగా కావచ్చు.. లేదా కొంతమేర ఆలస్యం కావచ్చు. ఎండలు భగభగ మండుతున్న ఈ తరుణంలో దప్పిక అయితే వారి అవస్థ మామూలుగా ఉండదు. కొన్ని కార్యాలయాలు అయితే ఊరికి దూరంగా ఉండటంతో అక్కడ దుకాణాలు కూడా లేకపోవంతో అమ్మకానికి కూడా నీరు దొరకని పరిస్థితి ఉంటుంది. సాధారణంగా వేసవి కాలంలో ప్రజల దప్పిక తీర్చేందుకు అధికారులు కార్యాలయాల్లో నీటి సౌకర్యం కల్పించాల్సి ఉంటుంది. అలా కాకుండా అధికారులు మిన్నకుండి పోవడంతో సమస్య మరింత తీవ్రతరమవుతోంది. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కార్యాలయం, వెలుగు కార్యాలయం, సామాజిక ఆరోగ్య కేంద్రం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అటవీ శాఖ కార్యాలయం తదితర కార్యాలయాల్లో వేసవి సమయంలో సందర్శకులు, అర్జీదారుల కోసం నీరు ఏర్పాటు చేయాల్సి ఉంది. కొందరు అధికారులు వారికి, వారి కార్యాలయ సిబ్బందికి మాత్రమే తాగు నీటి ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అధికారులు స్పందించి కార్యాలయాల్లో నీటి ఇబ్బందులు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చూస్తాం

కార్యాలయంలో తాగునీటి ఇబ్బందులు లేకుండా చూస్తాం. ప్రస్తుతం కార్యాలయంలో ఏర్పాటు చేసిన నీరు సరిపోక పోతే మరికొన్ని మినరల్ వాటర్ క్యాన్లు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులో ఉంచుతాం.

– కిన్నెర శాంతి, తహసీల్దార్, పెద్దదోర్నాల

బాల్య వివాహాలతో అనర్థం


మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సుభాషిణి

దొనకొండ: బడి మానుకుని బయట ఉన్న బాలికలకు చిన్న వయస్సులోనే పెళ్లిళ్లు చేయవద్దని, అది చట్టానికి వ్యతిరేకమని, వారి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో కిశోర బాలికలు, ఆశా కార్యకర్తలతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలకు చిన్న వయస్సులో వివాహం చేస్తే వారి జీవితాలు పాడవుతాయని, అలా కాకుండా ఉపాధ్యాయులు తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి బాల్య వివాహాలు నిషేధించేలా అవగాహన కల్పించాలన్నారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సీహెచ్ సుభాషిణి మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల కిశోర బాలికలను గ్రామాల్లో సర్వే చేసి ఒక గ్రూపునకు 5 నుంచి 20 మందిని గ్రూపులుగా చేసి వారిలో ఒక లీడర్‌ను నియమించాలన్నారు. వారికి ఏఎన్ఎంలు, వీఓఏలు కమిటీ సభ్యులుగా ఉంటారని తెలిపారు. మండల విద్యాధికారి ఎస్.సాంబశివరావు మాట్లాడుతూ కిశోర బాలికలకు ఎడ్యుకేషన్ గురించి తెలిపారు. సీహెచ్ఓ ఇన్నాసమ్మ, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అంబేడ్కర్ మేడేగా జరపాలి


మాట్లాడుతున్న దారా అంజయ్య

తాళ్లూరు: ప్రపంచం గర్వించదగ్గ నేత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్..అని, కార్మికులకు ఆయన సేవలు వెలకట్టలేనివని, మేడేను అంబేడ్కర్ మేడేగా జరపాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దారా అంజయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రం తాళ్లూరులో బుధవారం కార్మికులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భారతదేశ కార్మికుల కోసం అనేక చట్టాలు రూపుదిద్దారని, వాటితో దేశ కార్మికులు బ్రిటిష్ వారి నుంచి ఎదుర్కొంటున్న సమస్యలు తొలగిపోయి ప్రతి కార్మికుడు లబ్ధి పొందారన్నారు. బ్రిటిష్ కాలంలో 14 గంటల పని దినాలను 8 గంటల పని దినాలుగా మార్చిన ఘనత అంబేడ్కర్‌కే దక్కుతోందన్నారు. కార్మికులు బి.ప్రకాశం, రాజు, రవి, వెంకటేశ్వర్లు, మోషే, రమేష్ పాల్గొన్నారు.

భూసార పరీక్షల ఆధారంగా పంటలు వేసుకోవాలి


మట్టి నమూనాలు సేకరిస్తున్న ఏఓ


మట్టి నమూనా సేకరిస్తున్న వీఏఏలు

ముండ్లమూరు (కురిచేడు): భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎండీ ఫరూక్ సూచించారు. మండలంలోని ఉల్లగల్లు, పులిపాడు గ్రామాల్లో బుధవారం ఆయన భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు వీఏఏలు సేకరించారు. మండలంలోని 17 రైతు సేవా కేంద్రాల్లో 935 మట్టి నమూనాలు సేకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. భూసార పరీక్షలతో మట్టిలో ఉన్న పోషకాల విలువ తెలుస్తుందని, తదనుగుణంగా ఎరువులు వేస్తే పెట్టుబడి తగ్గి, దిగుబడి పెంచుకోవచ్చన్నారు. మట్టి నమూనా పరీక్షించేందుకు నిర్దేశించిన యాప్‌లో రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. నమోదు చేసుకున్న రైతుల పొలాల్లో నమూనాలు సేకరించి భూసార పరీక్షల ఆధారంగా ప్రభుత్వం సూక్ష్మ పోషకాలను రాయితీపై అందిస్తుందని తెలిపారు. ఏఈఓ వేమూరి శ్రీకీర్తి, వీఏఏలు ఆంజనేయులు, క్రాంతిరత్న, రైతులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో సత్ఫలితాలు

పుల్లలచెరువు: సాగు భూమిలో భూసార పరీక్ష చేయిస్తే ఆ భూమిలో ఉన్న పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు ఇతర సమస్యలు ఉంటే తెలుస్తాయని మండల వ్యవసాయాధికారి నిర్మలాదేవి సూచిస్తున్నారు. బుధవారం మండల కేంద్రంలో భూసార పరీక్షలకు మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మట్టి నమూనా ఫలితాలు తెలుసుకుని రైతులు తమ పొలాలకు పోషక విలువలు ఎంత మేరకు ఉన్నాయో, ఎంత మోతాదులో ఎరువులు వాడుకోవాలో తెలుసుకుని తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించేందుకు వీలుగా ఉంటుందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా మార్పు

పుల్లలచెరువు: ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు (ఏపీజీబీ) మే ఒకటో తేదీ నుంచి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకుగా పేరు మార్చినట్లు స్థానిక బ్రాంచ్ మేనేజర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడుతూ భారత ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ నెంబర్ ఎస్ఓ 1625 ప్రకారం ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంక్, సప్తగిరి గ్రామీణ బ్యాంక్‌లను విలీనం చేసి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్‌గా మార్చేందుకు చైర్మన్‌లు నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. బ్యాంక్ ఖాతాదారులకు యాథావిధిగా సేవలు అందుకోవచ్చని, ఖాతాదారులు బ్యాంక్ సిబ్బందికి సహకరించాలని, జరిగిన మార్పును గమనించాలని మేనేజర్ వినోద్‌కుమార్ కోరారు.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈపీ సీట్ల భర్తీ కోసం ఎస్టీ బాల, బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఈశ్వరసింగ్ తెలిపారు. మార్చి, ఏప్రిల్ 2025 ఎస్ఎస్‌సీ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన వారు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అడ్మిషన్లకు సంబంధించి ఈ నెల 25వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో పాటు 25–26 విద్యా సంవత్సరానికి 9వ తరగతిలో మిగిలిన సీట్ల భర్తీ కోసం ఎస్టీ బాలర నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు తెలిపారు. దరఖాస్తులు ఈ నెల 8వ తేదీలోపు పాఠశాలలో అందజేయాలని కోరారు. పూర్తి వివరాలకు 94160 94165 నంబర్‌కు ఫోన్ చేయాలని ఆయన సూచించారు.

రాజ్యాంగ హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న తహసీల్దార్ సంజీవరావు

తాళ్లూరు: ప్రతి ఒక్కరూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అమలు చేసిన రాజ్యాంగం హక్కులపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. మండలంలోని శివరాంపురం ఎస్సీ కాలనీలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ కుల వివక్షతతో ఎవరైనా ఇబ్బంది పెడితే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భూ సమస్యలు ఉంటే తక్షణమే పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సంజీవరావు అన్నారు. రీ సర్వే డీటీ ప్రశాంత్, ఎంపీటీసీ సభ్యుడు అనపర్తి చిన్న పుల్లమ్మ, యోహోన్, ఆర్ఐ పి.చంద్రశేఖరరావు, వెల్ఫేర్ అసిస్టెంట్స్, కాలనీ వాసులు పాల్గొన్నారు.



అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలి

పుల్లలచెరువు: స్పౌజ్ పింఛన్ల మంజూరులో కూటమి ప్రభుత్వం లేనిపోని నిబంధనలు విధించడం ఎంతవరకు సమంజసమని వైఎస్సార్ సీపీ జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ రఘు ప్రశ్నించారు. ఆయన బుధవారం మాట్లాడుతూ 2023 డిసెంబర్ 1 నుంచి 2024 అక్టోబర్ 31వ తేదీ మధ్యలో భర్త చనిపోతే భార్యకు పింఛన్ అందించేందుకు ఈ ప్రభుత్వం అనుమతులు జారీ చేసిందన్నారు. భర్తకు పింఛన్ ఉంటేనే భార్యకు మంజూరు చేస్తామని చెప్పడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. మండలంలోని పలు గ్రామాల్లో పింఛన్ పొందేందుకు అర్హులు ఉన్నా కొంత మందికి మాత్రమే అర్హత సాధించినట్లు చెబుతున్నారన్నారని పేర్కొన్నారు. పింఛన్ పొందని వ్యక్తులు చనిపోతే వారి భార్యకు పింఛన్ ఎవరు ఇస్తారని ప్రశ్నించారు. లేనిపోని జీవోలు తెచ్చి అర్హులను కూటమి ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేస్తోందని మండిపడ్డారు. ప్రభుత్వం వచ్చి 10 నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ పథకాలు అమలు గురించి పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి అర్హులను గుర్తించి వెంటనే పింఛన్ మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

బైకు నుంచి జారిపడి మహిళకు గాయాలు


క్షతగాత్రురాలిని 108లో తరలిస్తున్న సిబ్బంది

దొనకొండ: మోటార్ సైకిల్ వెనుక కూర్చుని జారి కిందపడి మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మంగినపూడి వద్ద బుధవారం జరిగింది. వివరాలు.. మండలంలోని వెంకటాపురం గ్రామానికి చెందిన వెంకట సుబ్బమ్మ సొంత పనిపై మంగినపూడికి ద్విచక్ర వాహనంపై వెను కూర్చుని వెళ్తోంది. అదుపు తప్పడంతో ఆమె జారి కింద పడి కుడి కాలు విరిగింది. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని ఈఎంటీ పి.వెలుగొండయ్య, పైలట్ ప్రసాదరావులు ప్రథమ చికిత్స చేసి వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. డీఎం విజయకుమార్, ఓఈ రాజేంద్రప్రసాద్ 108 సిబ్బందిని అభినందించారు.



ఎరువుల షాపులపై దాడులు

- అక్రమంగా నిల్వ ఉంచిన ఎరువులు సీజ్


ఎరువులు సీజ్ చేసిన వ్యవసాయాధికారులు

త్రిపురాంతకం: ఎరువులు, పురుగు మందుల దుకాణాలపై వ్యవసాయ శాఖ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. స్థానిక సుబ్రహ్మణ్యేశ్వర ట్రేడర్స్‌లో ఎరువులు, పురుగుమందులు పరిశీలించి రిజిస్టర్లు తనిఖీ చేశారు. రిజిస్టర్లలో నమోదు చేయని రూ.2.33 లక్షల విలువ చేసే ఎరువులు సీజ్ చేసి అమ్మకాలు నిలిపేశారు. దాడుల్లో ఇన్‌స్పెక్టర్ రవిబాబు, శివనాగ ప్రసాద్, రవి, కృష్ణ, వ్యవసాయాధికారి నీరజ పాల్గొన్నారు.

మానవత సంస్థకు శాంతి రథం


శాంతి రథాన్ని ప్రారంభిస్తున్న డిప్యూటీ తహసీల్దార్, జైలర్

దర్శి (కురిచేడు): మానవత స్వచ్ఛంద సంస్థకు దేవతి వెంకట సుబ్బయ్య, హనుమాయమ్మ కుమారులు వరప్రసాద్, భాస్కర్, మహానంద, రామారావులు శాంతి రథాన్ని బుధవారం అందజేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్లు, సబ్ జైలర్ వి.రమణ, డాక్టర్ మణిశేఖర్‌లు సంయుక్తంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవతి వరప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మానవత సంస్థ జిల్లా కార్యదర్శి మానవత సంస్థ విధి విధానాల గురించి సభలో వివరించారు. సంస్థ చైర్మన్ ధనిరెడ్డి వెంకటరెడ్డి, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, కోశాధికారి వేణు, డైరెక్టర్లు, మానవత సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శాంతి రథం దాతలు వరప్రసాద్, మహానంద, భాస్కర్, రామారావులను ఘనంగా సన్మానించారు. గడియార స్తంభం వరకు మానవత సభ్యులందరూ ర్యాలీ చేశారు.

పెద్దదోర్నాలలో ఆకస్మిక వర్షం

పెద్దదోర్నాల: మండుటెండలు, తీవ్ర ఉక్కపోతతో అల్లాడిన మండల ప్రజలు బుధవారం మధ్యాహ్నం ఆకస్మికంగా కురిసిన వర్షంతో కాస్త సేదతీరారు. కొద్ది రోజులుగా ప్రచండ భానుని తీవ్రతతో బెంబేలెత్తి బయటకు వచ్చేందుకు సైతం భయపడిన మండల ప్రజలు అకస్మాత్తుగా ఈదురు గాలులతో కురిసిన వర్షంతో ఊపిరి పీల్చుకున్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి అరగంట పాటు కురిసిన వర్షంతో ఒక్కసారిగా వాతావరణం చల్లగా మారిపోయి వడగాల్పుల స్థానంలో చల్ల గాలులు వీచాయి.


పెద్దదోర్నాలలో కురుస్తున్న వర్షం

